క్లుప్తంగా

రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక నంద్యాల చెక్‌పోస్టు బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా 300 ఎంఎం డయా పైప్‌లైనకు మరమ్మతులు చేపడుతున్నందున రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, చంద్రశేఖర్ నగర్, మారుతీనగర్, బృందావన్ నగర్, సరస్వతీ నగర్ జయరాం నగర్, ధనలక్ష్మీనగర్, వాసవీనగర్, బీటీఆర్ నగర్, మాధవి నగర్, కమల నగర్, శ్రీలక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీ, ఎన్‌జీవో కాలనీ,ఎఫ్‌సీఐకాలనీ(వార్డులు 19,20) లకు మంచి నీటి సరఫరా ఉండదని తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. సోమ వారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు ఆయిల్ అండ్ రైస్ మిల్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కులను హరించే బీజేపీ, దాని మిత్రపక్షమైన టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను ఘోరంగా ఓడించాలన్నారు. నాయకులు సాయిబాబా,నరసింహులు, పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

7న ఉగాది వేడుకలు

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో 7వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ఉగాది మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యవర్గ సభ్యులు తెలిపారు. తెలుగు సంవత్సరాది నూతన కాలమానిని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత జిల్లా కలెక్టర్ రామ్ శంకర్ నాయక్, కాంట్రాక్టర్ పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, గీతాంజలి నర్సింగ్ కళాశాల చైర్మన్ పెరుగు విజయ్‌వర్దన్‌రెడ్డి, విజ్ఞాన సేవా సమితి ఉపాధ్యక్షుడు మద్దిలేటి అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

థీమాటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం దగ్గర థీమాటిక్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ ఎంపోరియం మేనేజర్ బి.తిమ్మయ్య ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్, టెర్రకోట కుండలు తదితరవి ఉన్నాయి. హస్తకళలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మేనేజర్ తెలిపారు. లేపాక్షి ఎంపోరియంలో లభించే వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకు తగ్గింపు ఉందని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీ మధ్యాహ్న భోజన పథకం, శానిటేషన్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రామావేది డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు కనీసం వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని చెప్పారు.

ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే



కర్నూలు (టౌన్) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఖండేరి వీధిలోని రాయల్ ఫంక్షన్ హాలు మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి దువా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు

రంగుల హోలీ.. ఆనందాల కేళీ

- అంబరాన్నంటిన పండుగ సంబరాలు
- ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపిన యువత

నగరంలో హోలీ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఇక యువతీయువకులు ఉదయం నుంచి ఆటాపాటలతో సందడి చేశారు. ఫాల్గుణ పౌర్ణమి రోజును పురస్కరించుకుని నిర్వహించే ఈ వేడుకలో కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. నగరంలో స్థిరపడిన బంజారాలు, లంబాడీలు, గుజరాతీలు, రాజస్థానీలు ప్రత్యేక పూజలు జరుపుకొని ఇంటిల్లి పాది సంతోషంగా గడిపారు. విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, వివిధ సంఘాలు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. – కర్నూలు కల్చరల్



రంగులు పూసుకుంటూ..



మిలటరీ క్యాంటీన్ వద్ద చిన్నారుల సందడి



కేవీఆర్ కాలేజీలో విద్యార్థినుల కేరింత



కిసాన్ ఘాట్‌లో హోలీ ఆనందం..



కిసాన్ ఘాట్‌లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ..



సిల్వర్ జూబ్లీ కాలేజీలో..

కురువల సమస్యల పరిష్కారానికి సిద్ధం

కర్నూలు(అర్బన్): జిల్లాలో కురువలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధం అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, నగర అధ్యక్షుడు తవుడు శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ సుంకన్న తదితరులు ఎమ్మెల్యే కాటసానిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు శ్రీశైలంలోని శ్రీ అఖిల భారత కురువంశ నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన సమస్యలను వివరించారు. సత్రం విషయంలో ఇప్పటికి కొందరు తెలంగాణకు అనుకూలంగా ప్రవర్తిస్తున్న తీరు చాలా దారుణంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, వై. బాలనాగిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యక్షంగా మిగిలిన వారు పరోక్షంగా తమకు సహకారం అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే సత్రం విషయంలో సహకారం అందిస్తున్న వారికి విధేయతగా ఉండాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు పెద్దపాడు పుల్లన్న, కె.బీరప్ప, కె.హరిదాసు, బీసీ తిరుపాలు, బి. మద్దిలేటి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కాటసానిని కలిసిన కురువ సంఘం నేతలు

ఆధ్యాత్మికం

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన పదునెట్టాంబడి

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి ఆలయం, సప్తగిరినగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అయ్యప్పస్వామికి ప్రత్యేక అలంకారం, మహా పడి పూజ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అయ్యప్ప నామ స్మరణతో చేసిన భజన లు ఆధ్యాత్మికానుభూతిని కలిగించాయి. అయ్యప్ప ఆలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో గౌర పౌర్ణమి వేడుకలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో సోమవారం గౌర పూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ చైతన్య మహా ప్రభు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగన్నాథ్, బలదేవ్, సుభద్రామాయిలను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. గౌర నితాయ్ విగ్రహాలకు మహా శంఖాభిషేకం నిర్వహించారు. తులసి హారతి, మహా మంగళ హారతి జరిగింది.56 రకా ల భక్ష్యాలతో రాజభోగ నివేదన చేశారు. శ్రీ చైత న్య మహా ప్రభు లీలలుపై కర్నూలు ఇస్కాన్ బా ధ్యులు రఘునందన సేవక్ ప్రభు ఉపన్యసించా రు.హరే కృష్ణ హరే రామ సంకీర్తన చేశారు. ఇస్కా న్‌సభ్యులు,భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మి జయంతి

కర్నూలు కల్చరల్: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాలక్ష్మి జయంతిని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నవగ్రహ పూజ, గణపతి, శ్రీ సూక్త హోమ సహిత, శ్రీ లక్ష్మీనారాయణ మూల మంత్ర పూర్వక శ్రీ లక్ష్మీ సహస్రనామ హోమయుత, కుబేర పాశుపత రుద్రహోమం జరిగింది. శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రత్రం నిర్వహించారు. నవగ్రహ పూజ, గణపతి, శ్రీ సూక్త హోమ సహిత, శ్రీ లక్ష్మీనారాయణ మూల మంత్ర పూర్వక శ్రీ లక్ష్మీ సహస్రనామ హోమం, కుబేర పాశుపత రుద్రహోమం, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్):ఈ నెల 26న కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతుబజారును ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని వెల్లడించారు.

కొత్త పనులు చేపట్టకండి

కర్నూలు సిటీ: మనబడి నాడు- నేడు కింద పాఠశాలల్లో మొదటి, రెండో విడతల్లో చేపట్టి వివిధ దశల్లో ఉన్న పనులు కొనసాగించవచ్చునని, కొత్త స్కూళ్లలో కొత్తగా పనులు చేపట్టరాదని పాఠశాల ఇన్‌ఫ్రాస్టక్చర్ కమిషనర్ కాటమనేని భాస్కర్ స్పష్టత ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వలన మొదటి, రెండో విడత కింద చేపట్టిన పనులను పూర్తి చేయాలా? లేకపోతే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఏమైనా అడ్డు వస్తుందా అని పలువురు విద్యాధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆ పనుల విషయంపై పాఠశాల ఇన్‌ఫ్రాస్టక్చర్ కమిషనర్ స్పష్టత ఇచ్చారు.

జువైనల్ హోమ్ తనిఖీ

కర్నూలు(లీగల్) : నగరంలోని జువైనల్ హోమ్, శిరిడీ సాయి వృద్ధుల శరణాలయం, షెల్టర్ హోమ్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలకు సంబంధించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయం గురించి తెలిపారు. మహిళలు, పిల్లలు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

కర్నూలు (లీగల్): కర్నూలు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి బి.చంద్రుడు, బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి స్థానానికి వి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు పోటీలో ఉన్నారు. ఇక ఉపాధ్యక్ష స్థానానికి ఎం.నిత్యజీవరాజు, సంయుక్త కార్యదర్శి స్థానానికి డి.విక్రమ్‌సింగ్ ఎన్నికయ్యారు. కోశాధికారి స్థానానికి గౌతమ్ మానే తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఎం.మహబూబ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎస్.రామ్‌నాథ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి స్థానానికి బంగి సుధీర్, మహిళా ప్రతినిధి స్థానానికి జి.సుమనా రాణి ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల పోలింగ్ ఈనెల 28వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అనంతరం 3 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో భారీగా చేరికలు

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారు. సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచు పెరుగు భాస్కర్‌రెడ్డి, పెరుగు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్ రెడ్డి, అఖిలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 200 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. వీరందరికీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద వాడి గురించి ఆలోచన చేయలేదని, సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు, టీడీపీ కమిటీలకు మామూళ్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదని వారు అన్నారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకం తమ ఇంటి గడప దగ్గరకే వస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్షవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్న సీఎం అయితేనే సంక్షేమ పథకాలు పేదవాడికి అందుతాయని చెప్పారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. పార్టీలో చేరిన వారిలో వేణుగోపాల్ బ్రదర్స్, అయ్యన్నమూర్తి, బోయ దుబ్బన్న, మాజీ సర్పంచు కారం నాగన్న, బోయ రామాంజనేయులు, రాజు, మద్దిలేటి, రాజగోపాల్, రాముడు, పెద్ద మద్దిలేటి, అర్జునుడు, సంజీవనాయుడు, వెంకటేష్, శంకర్, మనోహర్ ఉన్నారు.



పార్టీలో చేరిన బూడిదపాడు గ్రామస్తులతో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష

టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి

ప్రభుత్వ సేవలను ప్రజల దరికి చేర్చుతున్న వలంటీర్ల గురించి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఆ పార్టీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్ల సేవలను దేశంలోని ఇతర రాష్ట్రాల పాలకులు ప్రశంసిస్తుంటే స్థానికంగా ఉన్న ప్రతిపక్ష పార్టీల నాయకులు మాత్రం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలను గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పారు. ఓటమి భయంతో వలంటీర్లను స్లీపర్ సెల్స్, టెర్రరిస్టులంటూ వ్యాఖ్యానించిన శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా సుధీర్ రెడ్డి వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, వైస్ ఎంపీపీ నెహమియా, మాజీ ఎంపీటీసీ చిన్నలక్ష్మన్న, ఉల్చాల సర్పంచు విద్యాసాగర్, ఎంపీటీసీ బి.హనుమంతు, ప్రభుదాసు, మల్లికార్జున, దావీదు, కేశవరెడ్డి, రంగారెడ్డి, బుజ్జన్న, జయన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తండ్రి గెలుపే లక్ష్యంగా తనయుడి ప్రచారం

కల్లూరు : పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 32వ వార్డులో ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వార్డులోని నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శివనరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలంటే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని శివనరసింహారెడ్డి

‘మేమంతా సిద్ధం’ను విజయవంతం చేయండి

- పోస్టర్లను ఆవిష్కరించిన కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ
- తెలుగు యువత అధికార ప్రతినిధితో పాటు 400 మంది పార్టీలో చేరిక

కర్నూలు (టౌన్) : ఈనెల 28 వ తేదీ నంద్యాల, 29న ఎమ్మిగనూరు పట్టణంలో మేమంతా సిద్ధం పేరుతో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని వైఎస్ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు అహమ్మద్ అలీఖాన్ పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం బస్సు యాత్రకు సంబంధించిన సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి న్యాయం చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసికట్టుగా గెలిపించుకుందామన్నారు. స్వప్రయోజనాల కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. టీడీపీ లోపాయికారిగా కాంగ్రెస్ పార్టీతో కూడా పొత్తు పెట్టుకుందన్నారు. ప్రజలకు మేలు చేసిన జగనన్న ఒంటరిగానే పోటీ చేస్తున్నారని, ఆయనకు అండగా నిలబడాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వలంటీర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీకాకుళం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సేవ చేస్తున్న వారి పట్ల తెలుగుదేశం నాయకులు విషం కక్కుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో పలువురు చేరిక

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం పలువురు చేరారు. తెలుగు యువత అధికార ప్రతినిధి, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సనా నరసింహ 400 మందితో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి వారికి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జనరంజక పాలన నచ్చి తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ , రెండు పార్లమెంటు స్థానాల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు శాయ శక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో తెలుగు యువతకు చెందిన సభ్యులు, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అభిమానులు ఉన్నారు.

- నగరపాలక సంస్థకు చెందిన 15 వ వార్డు ప్రజలు, యువకులు, మహిళలు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వీరికి స్థానిక గిప్సన్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పార్టీ కండువాలు కప్పారు. వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి వైఎస్ఆర్‌సీపీని గెలిపించుకుందామని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో శివ, మిథున్, ప్రేమ్, ప్రదీప్, జాన్సన్, సాగర్, వర్ధ అభి తదితరులు ఉన్నారు.



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ తదితరులు



ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన 15వ వార్డు ప్రజలు

మార్నింగ్ వాక్ చేస్తూ.. ఓటు అభ్యర్థిస్తూ..

కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సోమవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తూ క్రీడాకారులు, రిటైర్డు ఉద్యోగులు, వృద్ధులు, యువకులను కలిశారు. ఎన్నికల్లో తనకు అండగా నిలబడాలని అభ్యర్థించారు. క్రీడాకారులతో కాసేపు బ్యాడ్మింటన్, క్రికెట్ ఆడారు. ఇంతియాజ్ వెంట 23 వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ కటారి సురేష్‌కుమార్, స్థానికులు ఇమ్మానియేలు, తిరుమలేశ్వర రెడ్డి, ముస్తఫా తదితరులు ఉన్నారు.



బి.క్యాంపు క్రీడా మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్